**సంస్కారం చదువులోనూ, వేషంలోనూ లేదు. సంస్కారం పూర్తిగా హృదయ సంబంధమైంది. బస్సు ప్రయాణంలో ఒకానొక సంఘటనతో తెలుసుకున్న యీ సత్యం .... తరాత సుదీర్ఘ జీవితంమీద ప్రభావం చూపితే ఆ సంఘటన, సత్ఫలితాన్నిచ్చినట్లే!**

# సంస్కారం

పాలకూర సీతాలత



గజగజ లాడించే మార్గశిర మాసపు చలిని లెక్క చెయ్యకుండా గమ్యం చేరాలనే ఏకైక లక్ష్యంతో పరుగులు తీస్తోంది ఆర్టీసీ వారి నైట్ సూపర్ ఎక్స్‌ప్రెస్. సమయం రాత్రి పదిగంటలు కావటంతో బస్సులోని జనం నిద్ర పోతున్నారు. బస్సు కదులుతున్నంతసేపూ హాయిగా నిద్రపోయి, ఆగగానే లేచిపోయి, మళ్ళీ కునికిపాట్లు పడటం ప్రయాణీకులకు అలవాటే. నిద్రలో పక్కవాళ్ళమీదికి తూలిపోవడం, ఆ పక్కవాడు కూడా నిద్రలో ఉండటంవల్ల అతను గమనించకపోవడం మామూలే. డ్రైవరు తప్ప ఇంచు మించు అందరూ నిద్రమత్తులో ఉన్నారు. డ్రైవరు కూడా వాళ్ళలో చేరితే ఆ బస్సు గమ్యం పరలోకమే అవుతుందిగదా!

ఆ వాతావరణంలో నిద్రపట్టక చికాకు పడుతున్నది ఆ బస్సు ప్రయాణీకుల్లో ఒకడైన సుందరమూర్తి. అందుకు కారణం లేకపోలేదు. అతను ఇద్దరు కూర్చునే సీట్లో ఒక్కడే కూర్చున్నాడు. బస్సు కిటికీ అద్దం ఎలా పడిందో ఏమో క్రికెట్ బాలంత కన్నం ఉంది. అది స్వేచ్ఛగా బయటి చలిగాలిని సుందరమూర్తి మీదికి వదులుతోంది. ఇది సుందరమూర్తికి భరింపరానిదిగా ఉంది.

ఆ చలిగాలికి వెన్నులోంచి చలి పుట్టుకు వస్తున్నది. ఏ స్ట్రయిక్‌లోనో రాలుగాయి కుర్రకారు రాళ్ళు విసిరిన ఫలితమేమో ఈ కన్నం అని అనుకున్నాడు. సమ్మెలో విద్యార్థుల కోపానికి ముందుగా గురి అయ్యేవి ఈ బస్సులే. కాస్త కోపంవస్తే సమ్మె మొదలుపెట్టి అర్ధాంతరంగా ఆపెయ్యడం ఈనాటి విద్యార్థులకు అలవాటే. తను విద్యార్థిగా వుండగా చేసిన సమ్మెలు మర్చిపోయి, కుర్రకారుని కోపగించుకున్నాడు. పోనీ ఏదో జరిగిపోయింది. వెంటనే ఆ గ్లాసుని మార్చకుండా ఆర్టీసీ ఏం చేస్తోంది? కాస్సేపు వాళ్ళనికూడా తిట్టుకున్నాడు. అవునుమరి, ఎముకలు కొరికే చలి ఇబ్బంది పెడుతుంటే చికాకుకాక ఆనందం కల్గుతుందా?

సుందరమూర్తి ముప్పై ఏళ్ళ వాడు. చిన్నవయసులోనే పెద్ద పదవిని అనుభవిస్తున్న అదృష్టవంతుడు. సుందరమూర్తికి తన బాస్ మీద కూడా కోపం వచ్చింది. ఆ మర్నాడు తమ హెడ్ ఆఫీసులో జరగబోయే ఓ ముఖ్యమైన మీటింగుకి సుందరమూర్తిని వెళ్ళమన్నాడు. సుందరమూర్తి ఎప్పుడు టూర్‌కి వెళ్ళినా ఆఫీసు జీపులోనే వెళ్తాడు. ఆ రోజు సాయంత్రం కూడా జీపులోనే బయలుదేరాడు. ఓ యాభై మైళ్ళ ప్రయాణం తర్వాత దరిదాపుల్లో ఊరులేని నిర్మానుష్య ప్రాంతాల్లో జీపు చెడిపోయింది. డ్రైవరును అక్కడే వదిలి, ఆ దారినే వస్తున్న ఈ బస్సు ఎక్కాడు సుందరమూర్తి తను వెళ్ళేది చాలా ముఖ్యమైన మీటింగుకి కనుక. ఆ మర్నాడు జీపు బాగుచేయించి హైద్రాబాదు వచ్చి తనని ఆఫీసులో కల్సుకోమని చెప్పి ఈ బస్సు ఎక్కాడు. హాయిగా కవర్డ్ వెహికిల్లో

రాజాలాగ చెయ్యవల్సిన ప్రయాణం. సామాన్యంగా, సాధారణ వ్యక్తిలాగ బస్సులో చేస్తున్నందుకు కొంత అవమాన పడ్డా, మరి మార్గంలేక సరిపుచ్చుకున్నాడు. పెద్ద ఆఫీసరని చలిగాలికి తెలియదు కాబోలు-ధారాళంగా చిల్లులోంచి చొచ్చుకు వస్తూ సుందరమూర్తిని తాకుతోంది.

సుందరమూర్తి తన మీద కూడా కోపం వచ్చింది. బట్టలు సర్దుతూ. "ఈ బ్లాంకెట్ కూడా పట్టుకెళ్ళండి- అసలే చలికాలం" అని చెప్పిన భార్య రూపను కాదన్నాడు. తను వెళ్ళేక్లోజ్‌డ్ వెహికిల్లో అద్దాలు మూసేసి ప్రయాణం చేస్తే అసలు చలి వెయ్యదన్నాడు. "పోనీ, ఉంచుకోరాదా?" అని యావ ఇచ్చిన సలహాను పెడచెవిని పెట్టాడు. అందుకు ఇప్పుడు బాగా అనుభవిస్తున్నాడు. చుట్టూ చూశాడు. బస్సులో అందరూ దుప్పట్లలో శరీరాన్ని దాచుకుని గుర్రుపెట్టి నిదురపోతున్నారు. వారి సుఖానికి అసూయ రగిలింది మనసులో. వాళ్ళందరి దుప్పట్లూ బలవంతంగా లాక్కుని బయటకు విసిరి వెయ్యాలని అన్పించింది. తను కష్టాల్లో ఉండగా పక్కవాడు సుఖపడితే భరించలేకపోవడం మనిషికున్న బలహీనతల్లో ఒకటి. 'నేను ఏం పాపం చేశానని నాకు ఈ కష్టం? వాడు ఏ పుణ్యం చేశాడని ఈ సుఖం?' అని అనుకోవడం జరుగుతుంది. సుందరమూర్తి కూడా ఇప్పుడు ఇలాగే ఆలోచిస్తున్నాడు.... బస్సు బాగా వేగంగా పరుగు తీస్తోంది. అందుకే జోరుగా గాలివీస్తోంది. సాధారణంగా నత్తనడక నడిచే ఈ బస్సు లేడిలాగ ఎందుకు పయనిస్తోందీ? అనుకున్నాడు.

జేబులు తడుముకున్నాడు. సిగరెట్ పెట్టె తీశాడు. ఒక్కటే వుంది. దాన్ని నోట్లో వుంచుకుని చిరాగ్గా పెట్టెను విసిరి కొట్టాడు. మూడు నాల్గు అగ్గిపుల్లలు ఖర్చుపెటాక సిగరెట్ అంటించుకోవడంలో విజయం సాధించాడు. రెండు దమ్ములు లాగేక కొంత హాయి అన్పించింది. సిగరెట్ అయిపోయాక తిరిగి పరిస్థితి మామూలే.

ఏమీ చెయ్యలేని తన అసహాయ స్థితికి కోపం వచ్చిన సుందరమూర్తి కిటికీ అద్దాన్ని పూర్తిగా పక్కకు జరిపేశాడు. దాంతో పంజరంలోంచి బయటపడ్డ పక్షిలాగ చలిగాలి ఒక్కుమ్మడిగా బస్సులో ప్రవేశించింది. దానికి తట్టుకోలేని వెనుక సీటు ఆసామీ "చలిలో తలుపు తెరుస్తావేంటయ్యా? ముయ్యి" అన్నాడు చికాగ్గా. తనకి కూడా చలిఅన్పించితలుపుమూశాడు.

అయినా ఎంత తేలిగ్గా మాట్లాడాడు తనతో. తనేదో అల్లాటప్పా సుబ్బారాయుడనుకుంటున్నాడు కాబోలు. ఓ గొప్ప సంస్థలో నాలుగంకెల జీతగాడనీ, తన కనుసన్నలలో వందలమంది మెలగుతారని తెలియదు కాబోలు. అయినా హంసలాంటి తను విధి చిన్న చూపు చూసి కాకుల గుంపులో చేరాడు. కాకులేవో గొడవ చేశాయని అనుకోవడం అనవసరం అని సరిపెట్టుకున్నాడు. తన జీపు పాడు కాకపోతే హాయిగా ఈ వెధవ బాధలు లేకుండా ప్రయాణం చేసేవాడు కాదూ!

ఇంతలో బస్సు ఓ చిన్న ఊళ్ళో ఆగింది. జరా భారం తరుముకు రాగా, వంట్లోని సత్తువ హరించిపోగా, ముడతలు పడ్డ నల్లని శరీరంపై ఓ గొంగళి కప్పుకొని చేతికర్రతో, నిద్రకళ్ళతో, కొంత వంగుని నడుస్తూ ఓ ముసలి తాత ఎక్కాడు. టిక్కట్టు తీసుకుని ఖాళీ సీటుకోసం అడుగులు వేశాడు. ఎక్కడా ఖాళీ లేదు సుందరమూర్తి ప్రక్కన తప్ప. అక్కడ కూర్చుందుకు ఓ నిముషం సంశయించాడు. సుందరమూర్తి ఆహ్వానించలేదు. పైగా ఆ ముసలితాతను చూసి అప్పులవాడిని చూసిన మధ్య తరగతి వ్యక్తిలాగా ముఖం చిన్నబుచ్చుకున్నాడు. "బాబూ? కూకోనా?" అని అడిగేడు ధైర్యం చేసి తాత. ఇంకెక్కడా సీటులేక పోవడంవల్ల కూర్చోమని చెప్పక తప్పలేదు సుందరమూర్తికి. కూర్చోమన్నాడే కాని, తాతకేసి అసహ్యంగా చూశాడు. కారణం ఆ తాత సంఘంలోని అట్టడుగు జాతికి చెందినవాడని. సుందరమూర్తి కంటికి ఆ తాత జిడ్డు ఓడుతున్న ఆముదపు కుండలాగా అన్పించేడు. చిల్లుపడి మూల పడేసినసత్తు ముగ్గుబుట్టలాగ అన్పించేడు. అంటురోగిలాగ, శవంలాగా, బక్కచిక్కిన పిశాచంలాగా కూడా అన్పించేడు. అసహ్యాన్ని కళ్ళల్లోంచి కురిపిస్తూ సుందరమూర్తి ముఖం చిట్లించుకోగానే బస్సు బయలుదేరింది.

తన శరీరాన్ని చూసుకున్నాడు. కరుగుతున్న బంగారం రంగు. దబ్బపండు రంగు. ఆ తాత శరీరం మసిబొగ్గు లాగ, కాకిలాగ, నల్ల సిరాలాగ అసహ్యంగా వుంది. ఇలాంటి అలగాజనాన్ని ఆర్టీసీ ఎక్కించుకోడం మానెయ్యాలి. అయినా ఈ ముసలి తాతకి మాత్రం ఏ పాసింజరు లోనో వెళ్ళక నైటెక్స్‌ప్రెస్ కావాల్సొచ్చింది. అబ్బే! రోజులు బాగుపడవు. ఈ జనాలు పొత్తైపోయారు.

బస్సు కుదుపులో తాత చెయ్యి తగిలింది సుందరమూర్తికి. కసురుకున్నాడు.



రావణుడికి చెయ్యి తగిలిన సీతలాగ, దుశ్శాసనుడు తాకిన ద్రౌపదిలాగ. చీదరించుకున్నాడు. "మీ ఎవడ తావేం ? సరిగ్గా కూర్చోరాదూ ? "అని కసురుకున్నాడు. చిన్నబోయిన తాత మారు పలుకకుండా సర్దుకుని ఓ మూలకు ఒదిగి కూర్చున్నాడు

యథాప్రకారం చలిగాలి అద్దంలోంచి వీస్తూనే వుంది. జేబులు తడుముకుని సిగరెట్లు అయిపోయాయని గుర్తొచ్చి నిటూర్చాడు. విపరీతంగా చలివేస్తోంది. కళ్ళు మండుతున్నాయి. తనకి కన్పించని యమకింకరులు నగ్నంగా మంచుకొండల మీంచి దొర్లిస్తున్నప్పటి చలిని ఫీలవుతున్నాడు. ప్రయాణం చేస్తున్న ఓడలోంచి శత్రువులు సముద్ర మధ్యంలోకి తోసేసినట్టు ఫీలయ్యాడు. కొద్దిగా వణుకు వస్తోంది. అమ్మో! తను ఈ చలికి చచ్చిపోడుగదా! ఒకరకంగా ఈ బాధ కన్నా ఆ చావే మంచిదిలాగ వుంది.

నిన్న ఈ పాటికి భార్య రూప కౌగిలిలో కరిగి ఆదమరిచి నిద్రపోతున్నాడు. అది స్వర్గం. ఇప్పుడు తనున్నది నరకం. ఇప్పుడు తనకి కావల్సింది కాస్తంత వెచ్చదనం. అది కరువైపోయింది. మూలిగాడు సుందరమూర్తి.

సుందరమూర్తి అవస్థలన్నీ గమనిస్తూనే వున్నాడు తాత. గొంగళీ కప్పుకున్న శరీరం వేడిగా వుంది. "ఏం బాబూ! దుప్పటీ లేదా ?" అడిగేడు. లేదని చెప్పి మళ్ళీ మూలిగాడు సుందరమూర్తి. తాతలో ఓ వింత ఆలోచన కల్గింది.

పక్కనున్న మనిషి చలికి గడ్డకట్టుకుపోతుంటే, తనొక్కడు గొంగళిలోని వెచ్చదనం అనుభవించడమా ? ఆ వెచ్చదనం అతనికీ పంచితే ?

"బాబూ ! సూడు.... ఈ కొస తీసుకుని కప్పుకో...." అంటూ గొంగళి ఓ చివర అందించేడు.

ఓ నిముషం ఆలోచించేడు సుందరమూర్తి. తీసుకొమ్మని మనసు తొందర పెట్టింది. అందుకున్నాడు.

గొంగళి చాలా పొడవైనది. తాత భుజం మీంచి బయలుదేరిన గొంగళి సుందరమూర్తి మీదుగా వచ్చి తిరిగి తాత భుజం మీద అంతమైంది.

ఒకే గొంగళిలో - యిద్దరు.

తాత గొంగళిలో చోటిచ్చాడు సుందరమూర్తికి.

గొంగళి - ఇద్దరికీ సమానంగా వెచ్చదనం అందచేస్తోంది.

సుందరమూర్తి శరీరంలో కాస్త వేడి పుట్టింది.

గొంగళి లోపల - సుందరమూర్తి చెయ్యి తాత చెయ్యి ఒకటికొకటి తగులుతున్నాయి.

తాత భుజం. సుందరమూర్తి భుజం ఆనుకుని ఉన్నాయి.

సుందరమూర్తి కాలు, తాత కాలుని రాసుకుంటోంది.

కాస్సేపటి క్రితం అసహ్యించుకున్న తాత శరీరాన్ని తాకుతున్నాడు సుందరమూర్తి బంగారం రంగుగల సుందరమూర్తి శరీరం, మసి బొగ్గు రంగుగల తాత శరీరాన్ని రాసుకుంటోంది.

దేశంలోని ఐక్యతకు అద్దంపట్టే అందమైన దృశ్యం. సమాజంలోని ఓ అట్టడుగు వ్యక్తి. ఓ హైక్లాసు వ్యక్తి ఒకే సీటులో, ఒకే దుప్పటిలో-గాంధీగారు ఆ బస్సులోనే వుంటే, ఆ దృశ్యం చూస్తే పరవశించిపోయేవాడు ప్రభుత్వానికీ విషయం


# ఈ ఏటి మేటి పుస్తకం

ప్రచురించిన 8 నెలల్లోనే
10,000 ప్రతులుపైగా అమ్ముడయిన అపురూపమైన నవల
**అభిశాపం.**

* ఒకే వ్యక్తి రెండుసార్లు మరణించటం సాధ్యమా ?
* భర్తనే సర్వస్వంగా మనసా, వాచా తలచే స్త్రీ జీవితాన్ని ఏక కాలంలోనే ఇద్దరు పురుషులు పంచుకోటం జరుగుతుందా?
* ఎంత మంచి మనసు, వున్నతమైన సంస్కారం వున్నా తన భార్యని మరో వ్యక్తి భార్యగా పెంచమని ఎవరైనా చెప్పగలరా?

ఆనంద్, గాయత్రి, ప్రశాంత్...వీళ్ళ జీవితాల్లో యివన్నీ జరిగాయి.

అడుగు అడుగునా మీ వూహల్ని తల్లకిందులు చేసి, మీ ఆత్రత, ఉత్కంఠల వేగాన్ని పెంచే నవల 'అభిశాపం' చదవండి !

ఆంధ్రుల అభిమానాన్ని అపారంగా చూరగొన్న - 'ఆరాధన' నవలా రచయిత్రి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి కలంనుంచి వెలువడిన నవ్యనవల.




వెల 10 రూపాయలు

మీ దగ్గరలోవున్న విక్రేతనడగండి లేదా మాకు రాయండి!
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ - 500 003

తెలిస్తే సుందరమూర్తిని ఓ ఆదర్శ మూర్తిగా గుర్తించి ఓ బిరుదు తగిలించి పారేసేది (సారీ! ఈ మధ్య పద్మశ్రీలు రద్దు చేశారుగదూ.)

కాస్త చలి చచ్చి వేడిపుట్టగానే సుందరమూర్తికి నిద్ర వచ్చింది. అలాగే నిద్రపోయాడు. నిద్రలో తాత భుజం మీద కాస్సేపు వాలాడు. సుందరమూర్తిని ఓ రెండు గంటలు నిద్రపోనిచ్చి ఏదో ఊళ్ళో ఆగింది బస్సు. మెలకువ వచ్చిన అతను బస్సుదిగి సిగరెట్లు తెచ్చుకున్నాడు. తాతకూడా నిద్రలేచాడు. బస్సు బయలుదేరినా ఇక నిద్రరాక తాతతో కబుర్లు మొదలుపెట్టేడు సుందరమూర్తి. తాత తన గురించి చెప్పుకున్నాడు.

తాత పేరు వీరేశు. అంత ముసలితనంలోనూ ఆదుకునేవారులేక పొలం కౌలుకి తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. చూసేవాళ్ళు లేరంటే పిల్లలు లేరనికాదు. ముసలితనంలో ఆదుకోవాలన్న జ్ఞానంలేని ఓ కొడుకు, పెళ్ళయిన ఓ కూతురు వున్నారు. కొడుకు తన లాగ పల్లెలో అష్టకష్టాలు పడకూడదని తలచి, భారం అయినా రెక్కలు ముక్కలు చేసుకుని చదివించాడు. చదువయ్యాక ఓ చక్కని ఉద్యోగం కూడా సంపాదించుకున్నాడు. కానీ తల్లిదండ్రుల్ని ఆదుకోవాలన్న ఇంగిత జ్ఞానాన్ని మాత్రం కోల్పోయాడు. బస్తీలో ఓ నాటకాల కంపెనీ పిల్లతో దోస్తీకట్టి. దాన్ని పెంచుకుని. ఇల్లాల్ని చేసాడు తల్లిదండ్రుల అనుమతి లేకుండా "ఇదేమిట్రా?" అని అడిగినందుకు కోపం తెచ్చుకుని తల్లిదండ్రుల్ని దూరంగా వుండమన్నాడు. కొడుకు నయాపైస పంపకపోయినా, తనకే తిరిగి పంపమని అడగనందుకు సంతోషించి రెక్కలు ఆడించి డొక్కలు నింపుకుంటున్నాడు. కొడుకుని చూసి చాలా రోజులైందని ఓ సారి వెళ్ళితే, భరింపరాని అవమానం జరిగి వెంటనే వచ్చేశాడు. కొడుకు ఇంటికి వచ్చిన కొందరు స్నేహితులు వీరేశుని చూసి "అతను మీ కొత్త నౌకరా?" అని అడిగితే. కొడుకు నవ్వుతూ అవునన్నాడట. అంతకంటే కొన్ని వందల బరిశెపోటు తక్కువబాధనుకలిగిస్తాయనిఅనుకున్నాడు. అందుకే ఇక మళ్ళ బతికుండగా ఆ ఇంటి గడప తొక్కరాదని నిర్ణయం చేసుకుని వచ్చేశాడు. ఇకపోతే అతని అల్లుడుకూడా తిన్ననయినవాడు కాదుట. రోజూ తాగొచ్చి పెళ్ళాన్ని చితక తంతాడట. ఇప్పుడా కూతురు కనలేక అవస్థపడుతోందన్న కబురు తెల్సి. ముసలి ప్రాణం కొట్టుకోగా ఆ కూతురి దగ్గరకు ప్రయాణం అయ్యాడు.

అంతా చెప్పి చివర్లో వీరేశు అన్నాడు.

"కడుపున పుట్టిన బిడ్డలు ఏదో వుద్ధరిస్తారని అనుకోడం మన బెమ బాబూ! ఆళ్ళని పెంచటం మన ధరమం గనుక పెంచి ఒది లెట్టాలి. ఆళ్లేదో నెత్తిన పాలు పోత్తారని ఆశ లెట్టుకో కూడదు బాబూ. నాకేటయింది? నాలాంటోళ్లు కూడా ఇంకెందరో?. సెటంత కొడుకుని నమ్ముకోటం కన్నా సెట్టులు మొలిసే మట్టిని నమ్ముకోటం మంచిది బాబూ. ఊరు పొమ్మంటా. కాడి రమ్మంటా వున్న ఈ వయసులో ఇసిరాంతి లేక రెక్కలు పిండుకుని ఎగసాయం సెయ్యాల్సి వచ్చినాది. నాకొడుకే తిన్నగుంటే ఈ బాదలుండేయి కావు గందా. మా సిన్నకులాల్లో ఇదే బాధబాబూ. మీలో తలితండ్రుల్ని నెత్తిన ఎట్టుకుంటారు. మీరున్నారు-మీ కారనాన మినాయుసగోరు ఎంత సుఖపడతన్నరో?" అంటూ తన అమాయకతను కూడా జోడించాడు.

తాత మాటలు వినగానే గురిచూసి తన గుండెల్లోకి ఎవరో తుపాకులు పేల్చినట్లు ఉలిక్కిపడ్డాడు సుందరమూర్తి. తనమీద ఎంత కమ్మని నమ్మకం చూపాడు? కానీ ఆ పొగడ్తకు తను పూర్తిగా అనర్హుడు. వీరేశు కొడుకు ప్రవర్తనకీ, తన ప్రవర్తనకీ కాస్త తేడాలున్నా, పోలికలు చాలానే ఉన్నాయి. తన ఆఖరు తమ్ముడు పి.యు.సీ ప్యాసయిన సంవత్సరమే తన తండ్రి రిటైరయ్యాడు. దాంతో తను చదివించలేనని చేతులు ఎత్తేశాడు తండ్రి. తమ్ముడికి మాత్రం చదువుకోవాలని ఆసక్తి. తెలివీ వున్నవాడు. అతన్ని పైకి చదువుకోనివ్వడమే మంచిదని తనూ అభిప్రాయపడి తమ్ముడ్ని ఇంజినీరింగ్ కాలేజీలో చేర్పించాడు. వాడి చదువు మధ్యలో వుండగానే పెళ్ళి చేసుకున్నాడు తను. కొత్తభార్య కబుర్ల మోజులో స్వార్థం తల ఎత్తి. తన పదిహేను వందల జీతం తనకే చాలటంలేదనిచెప్పి, తమ్ముడికి సహాయం చెయ్యలేనని రాసేశాడు. దాంతో తండ్రికి మండుకొచ్చి ఓ వుత్తరం రాసి పడేశాడు"

"ఈ విషయం ముందే అఘోరిస్తే వాడు చదువు మానేసి ఏ కోమటి కొట్టులోనో పద్దులు రాసుకునేవాడు. ముందు ఆదర్శ పురుషుడిలాగ వాడ్ని కాలేజీలో చేర్పించి. అర్ధాంతరంగా కుదరదంటే వాడి భవిష్యత్తు ఏం కావాలి? చదువు మధ్యలో ఆగితే వాడి ముఖం ఎవరు చూస్తారు? ఇవతల ఒడ్డున ఉన్న వ్యక్తిని నది దాటిస్తానని మాటిచ్చి. నావ నది మధ్యలో ఉండగా ఆ వ్యక్తిని నదిమధ్యకి తోసినట్లు చేశావు. అంతగా వీలు కానప్పుడు అసలు నావలోకి రావద్దంటే బాగుండేది కదా!" అంటూ దండకం చదివాడు తండ్రి. ఆ ఉత్తరం చదివి కోపం వచ్చినా, వెంటనే రూపతో సినిమా ప్రోగ్రాంలోపడి కోపాన్నిమర్చిపోయాడు. ఇంతవరకూ మళ్ళా డబ్బు పంపలేదు. వీరేశు తాత మాటలు తనలో నిద్రపోతున్న వివేకాన్ని మేలు కొల్పింది. అవును మరి. చదువు మధ్యలో ఆగిపోతే తమ్ముడి భవిష్యత్తు ఏమిటి?

ఆ రోజు తండ్రి రాసిన ఉత్తరానికి తనలో ఏ చైతన్యమూ కలుగలేదు గానీ. ఈ రోజు వీరేశు తాత చెప్పినది విన్నాక తన పొరపాటు తెల్సివచ్చింది. పైగా తన మీద ఎంతో నమ్మకం వుంచి "నువ్వు నీ తల్లిదండ్రుల్ని సుఖపెడుతున్నావు." అంటూ మెచ్చుకున్నాడు. తను తాతకు


## కావలెను

ప్రభుత్వ వ్యవసాయ శాఖలలో పనిచేయుటకు 8th Standard ప్యాసై Degree వరకు చదివిన 15 సంవత్సరములు నిండిన. అభ్యర్థినీ అభ్యర్థులు కావలెను. శిక్షణా కాలము 3 నెలలు. స్టయిఫండు కలదు.

జీతము:- రు. 425 లు. శిక్షణా కాలమందు ఉచిత హాస్టలు వసతి. పుస్తకములు ఇతర సదుపాయములు లభించును. భోజన వసతి కలదు. శిక్షణ తెలుగులో ఇవ్వబడును. శిక్షణానంతరము Fieldman· Demanstrate Assistant· Poultry keeper. Cattle inspector. instructor ఉద్యోగములు లభించును. ఇతర వివరములు. అప్లికేషన్ ఫారము పొందుటకు రు. 2/-లు పంపవలయును.

గమనిక: పోస్టలు మూలముగా కూడా శిక్షణ ఇవ్వబడును.

Principal; Indian Agro Technical Training College
P. H. Road. Koyambedu, Madras-602 102.

ఋణపడి వుంటాడు. చనిపోయేంత తీవ్రమైన చలిలో వెచ్చదనం పంచి బ్రతికించాడు. పెద్దల పట్ల తన కర్తవ్యాన్ని గుర్తు చేశాడు, తమ్ముడికి వెంటనే ఓ రెండు వందలు పంపాలని నిశ్చయం చేసుకున్నాడు మన్నింపు కోరుతూ తండ్రికో ఉత్తరం కూడా రాయాలి.

తాత మధ్య మధ్య దగ్గుతూ ఉన్నాడు. "ఏం తాతా! నీ ఆరోగ్యం కూడా అంత బాగున్నట్లులేదు?" అన్నాడు జాలిగా. "ఏం బాగులే బాబూ. ముసిలితనంలో రోగాలు రావా!" అన్నాడు తేలిగ్గా "ఒళ్ళు బాగోనప్పుడు విశ్రాంతి తీసుకోకూడదా?" అని సలహా ఇచ్చాడు సుందర మూర్తి

"ఏం ఇసిరాంతి బాబూ! ఒక్కరోజు పొలం ఎల్లకపోతే పనులు అట్టాగే ఉండి పోతాయి. కట్టమైనా ఎలి పనిపాటలు సేసుకోవాలికాని ఊరుకుంటే కడుపులెలా నిండుతయి బాబూ. నేనూ, నాఇంటిదీ, బతకాలి కదా బాబూ!" అన్నాడు.

వీరేశు తాత కొడుకుమీద బాగా కోపంగా వున్నాడు. వచ్చింది సుందరమూర్తికి. ముసలి తల్లి దండ్రులు అనారోగ్యంతో బాధపడుతుంటే ఆదుకోవల్సిన బాధ్యత కొడుకుది కాదూ? అనుకున్నాడు వెంటనే ఆలోచనలు తన తండ్రి మీదకు మళ్ళాయి.

ఆ పల్లెటూర్లో, వైద్య సదుపాయాలు అంతంత మాత్రంగా వున్న ఆ మారు మూల ఊళ్ళో టి. బి. లో బాధపడుతుంటే సంఘానికి వెరచి ఏవో డబ్బులు పంపేదే గానీ ఆయన పరిస్థితి ఎలావుందో ఆలోచించాడా? అక్కడికి దగ్గర్లోవున్న తన అత్తవారింటికి పండుగకు వెళ్ళి. శలవు లేదని తండ్రిని చూడకుండా వచ్చేసినపుడు తండ్రి బాధపడ్డాడేమో అని ఇప్పుడు అన్పిస్తోంది. హెడ్ క్వార్టర్స్‌కు వెళ్ళాకా ఓ వారం రోజులు శలవు తీసుకుని వెళ్ళి తండ్రిని చూసి. ఆయన రానని అన్నా బలవంతంచేసి బయలు దేరదీసి తన దగ్గర వుంచుకోవాలి అని నిర్ణయించుకున్నాడు, ఈ ఆలోచన రాగానే మనసు హుషారుగా గానం చేసింది. జేబు లోంచి సిగరెట్ తీసి హుషారుగా ముట్టించేడు.

ఈనాటి ఈ బస్సు ప్రయాణం తనలో చాలా చిత్రమైన అనుభూతులు కల్పిస్తూ. తన తప్పు తెల్సుకునేలా చేసింది. జీపులో ప్రయాణంచేసి వుంటే ఈ అనుభవం, ఈ ఆలోచనలు ఎప్పటికీ కలిగేవి కావేమో!

తనింక ధన సహాయం చెయ్యలేనని చెప్పాకా, తమ్ముడు తనకో ఉత్తరం రాశాడు అది కూడా తనని కదల్చలేక పోయింది కానీ ఈ క్షణంలో ఆ ఉత్తరం లోని సంగతులు తలుచుకుంటే వెన్ను లోంచి వణుకు పుట్టుకొస్తోంది.

"అన్నయ్యా! నన్నింక నువ్వు చదివించలేనని రాసినందుకు నీమీద నాకు కోపం ఏమిలేదు. పైగా బి.యి. మూడో సంవత్సరం పూర్తి చేసేంతవరకూ చేసిన సహాయానికి ధన్యవాదాలు. ఇంక మిగిలిన రెండు సంవత్సరాలూ ఎల్లాగో పూర్తి చేస్తాను నాన్నగారికి కూడా బరువుకాకుండా నాకాళ్ళమీద నేనే నిలబడాలని నిశ్చయించుకున్నాను. అందుకే మా ఫ్రెండ్ తమ్ముళ్ళిద్దరికి ట్యూషన్లు చెప్పడం ఆరంభించాను. మా హాస్టలుకు దగర్లోఉన్న సినిమాహాల్లో ఫస్టు షోకి. సెకండ్ షోకీ టిక్కెట్లు అమ్మే చిన్న ఉద్యోగంకూడా ఓ ఫ్రెండు ద్వారా సంపాయించాను. ఎల్లాగూ మెరిట్ స్కాలర్‌షిప్ ఉంది గనుక ట్యూషన్ ఫీజు కట్టక్కర లేదు. శాయశక్తులా ఈ డిగ్రీ కంప్లీటు చెయ్యడానికే ప్రయత్నిస్తాను. నువ్వేం వర్రీకాకు. మరొక్కసారి నీకు కృతజ్ఞతలు తెల్పుకుంటున్నాను." అంటూ రాశాడు.

ఆ విషయాలు ఇప్పుడు తల్చుకుంటుంటే సుందరమూర్తి ఒళ్ళు జలదరించింది. తెలివైన తమ్ముడి భవిష్యత్తు బుగ్గి చేసే అధికారం తనకు లేదు తనింత పెద్ద హోదాలో ఉండి తన తమ్ముడు సినిమా టిక్కెట్లు అమ్ముకుని చదువుకునే అవసరం ఏర్పరిచిన తను క్షమార్హుడు కాడు. వెంటనే వాడికి తిరిగి సహాయం చెయ్యడం మొదలుపెట్టాలి. తీవ్రంగా ఆలోచించి నిర్ణయించుకున్నాడు సుందర మూర్తి.

ఇంతలో తాత పలకరించడంతో ఆలోచనలు ఆగిపోయాయి. "బాబూ! నేను దిగాల్సిన ఊరు వస్తంది. నేను దిగిపోతన్నా. నాకు ఒక యిసయం బాధ కల్గిస్తంది బాబూ! నేను దిగిపోతూ, ఈ గొంగలి తీసుకుపోతాను గందా. ఆ తర్వాత సలివేస్తే ఎలా ఉంటుంటావు బాబూ! అదే నా ఇచారం. ఈ గొంగలి నీకిచ్చిపోదామన్నా. బీదోడిన్ని దిన్ని ఒదులుకోలేను.

మీ అందరి అభిమానాన్ని చూరగొన్న...
మాదిరెడ్డి సులోచన,
వాసిరెడ్డి సీతాదేవి, సి. ఆనందారామం, పరిమళా సోమేశ్వర్
యద్దనపూడి సులోచనారాణి...
ఎన్. ఆర్. నంది, ఆదివిష్ణు మొదలగు
ప్రముఖుల రచనలతో..
ఆఫ్‌సెట్ ముఖచిత్రంతో!
1/4 డెమ్మీ సైజులో!
52 పేజీలతో..
సరికొత్త పంథాలో వస్తోంది!
వెల: 0-75 పైసలు!!
జ్యోతి వారపత్రిక
జ్యోతి వారపత్రిక
P.B. No. 387, చెట్లబజార్, గవర్నర్‌పేట, విజయవాడ-2.
ఫోన్: 76770 ఎక్స్‌టెన్షన్-2
DIMPLE

# "హ్యాపీ న్యూ ఇయర్"

కాలం చేసిన కల కలంలో
హఠాత్తుగా అగుపించిన మనిషి మెదడులో
పుట్టినవీ వత్సరాలు. దశాబ్దాలు శతాబ్దాలు.
గడచిన నిన్నలకు, రాబోయే రేపులకు మధ్య
చిక్కి నలిగిపోయిన వర్తమానం చేసే
పొలికేకల ప్రతిరూపం నేటి ఈ సంబరాలు.
కాలానికి క్షణ క్షణానికీ పెరుగుతున్న అనుభవాన్ని కాదనలేక
దాని గొప్పదనంముందు తన చప్పదనం వూహించలేక
దానితో కాంప్రమైజ్‌అయి దాన్నే ప్రైజ్ చేస్తున్న మనిషి
కల్పించుకున్నాడీ కొత్త సంవత్సరాల ఖుషీ.
ఇది నిజానికి ఇంద్రజాలాన్ని మించిన
కాలంచేసే గారడీకి రెమిడీలేక
మనిషి సృష్టించుకొన్న "పర్పెచ్యువల్ డిఫెన్స్."
నగం చచ్చిన ఆశలకు
ప్రాణం రెన్యూయల్ చేయడాని‌కి
తనకు తాను కల్పించుకొన్న "కన్వీనియన్స్."
అందుకే....
ఎలాగైనా వెళ్ళిపోతుందని పాత సంవత్సరాన్ని పొమ్మన్నాను.
వే వద్దన్నా వస్తుందని కొత్త సంవత్సరమూ "వెల్కమ్" అన్నాను
పిలిచిన వెంటనే
న్యూయియర్ నాజూకుగా రావడం ముదావహం.
వెళ్ళిపో అన్నానని
అలిగి మళ్ళీ తిరిగి రాకపోవడం
గడచిన సంవత్సరానికున్న అహం.

—టి. హెచ్. నటరాజారావ్

నువ్వు ఆ తర్వాత చలికి వనికితే భరించనూలేను."

ఇది విని సుందరమూర్తి ఆశ్చర్యపోయాడు. లోకంలో మంచివాళ్ళు వుంటారని తనకు తెలుసునుగానీ, ఇంత మంచి వాళ్ళు ఉంటారని కలలోకూడా ఊహించలేదు. అలాంటి వ్యక్తిని ఇప్పుడు కళ్ళారా చూస్తున్నాడు. సిగ్గుపడకుండా నిజం చెప్పాలంటే ఆ తాత పాదాలకి మొక్కాలని అనిపిస్తోంది. తాత బస్సుదిగి వెళ్ళిపోతూకూడా ఆ తరువాత తనుపడే బాధని తల్చుకుని విచారిస్తున్నాడు. ప్రపంచంలోని మంచితనాన్ని అంతా కలిపి ఓ మూర్తిగా మలిస్తే ఆ మూర్తి ఈ తాతే అవుతాడు. ఆదిలో ఎంతో తక్కువగా తలచిన ఈ తాత తన మంచితనంతో "ఇంతింతై, వటుడింతయై, మరియు దానింతై...." అన్నట్లు శిఖరాగ్రానికి ఎదిగిపోయాడు.

బస్సు ఆగింది. వీరేశంతాత దిగడానికి లేచాడు. అతని చెయ్యి పట్టుకుని ఆపాడు సుందరమూర్తి. "తాతా! నీ కథంతా విన్నాకా నాకో ఆలోచన వచ్చింది. నీ సమస్యని శాశ్వతంగా పరిష్కరించలేను గానీ కొంతవరకూ సహాయం చెయ్యాలనిపిస్తోంది. అందుకే ఈ యాభై రూపాయలూ వుంచు...." అంటూ పర్సు తెరిచాడు.

చేతులు జోడించాడు తాత. "ఎన్నలాంటి నీ మంచి మనసుకి కోటి దణ్ణాలు బాబూ! నేను బీదోడ్ని కావచ్చుగానీ బిచ్చగాడ్ని మాత్రంగాను బాబూ! అందుకే.... నీ ఈ సహాయాన్ని వద్దంటున్నాను.

నా కొడుకునీ అంత మంచోడు అయితే నా బతుకు ఏరేగా వుండేది. జీవితంలో ఓ మంచి మడిసిని కలిసినందుకు ఆనందంగా ఉంది. ఒస్తాబాబూ.... ఒస్తా...." అంటూ కర్ర చప్పుడు చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

అప్పుడే వెలుగురేఖలు విచ్చుకుని నిద్రపోతున్న ప్రజానీకాన్ని మేలుకొల్పుతున్నాయి. అదే క్షణంలో సుందరమూర్తి మనసులోని చీకటి పొరలుకూడా అప్పుడే అతని మెదడులో ఉదయించిన జ్ఞాన కాంతికి తట్టుకోలేక పారిపోతున్నాయి. సుందరమూర్తి తీవ్రంగా ఆలోచించాడు.

తను ఓ ఉన్నత కులంలో పుట్టాడు. కానీ బుద్ది మాత్రం ఉన్నతమైనది కాలేకపోయింది. కానీ ఆ తాత ఓ అట్టడుగు జాతికి చెందినవాడు. అయినా పరోపకార బుద్ధిని ప్రదర్శించి ఉన్నతుడైపోయాడు. సంస్కారం అన్నది కులాన్ని బట్టికాదని బుజువు చేశాడు. తను చదువుకున్నవాడు. నాగరికుడు. తెల్లని ఇస్త్రీమడతలు, పాయింటెడ్ షూతో కన్పిస్తాడు. కానీ చదువులేని, ఓ పల్లెటూరి సాదా మనిషిలో ఉన్నతమైన సంస్కారం కన్పడింది. ఇస్త్రీ మడతలకీ, సంస్కారానికీ సంబంధం లేదని తెల్సిపోయింది ఆ మనిషిని తాకడానికే అసహ్యించుకున్న తనకి గొంగళిలో చోటిచ్చి గొప్పతనాన్ని చాటుకున్నాడు. ఆ గొంగళిలో తమ ఇద్దరి శరీరాలూ తాకుతూ ఉన్నా, అంతకుముందు తనలో ఉన్న అసహ్యం ఏమైంది? పైగా ప్రయోజకుడైన కొడుకు తండ్రిని మరిచిపోతే, ఆ తండ్రి ఆవేదన ఎలా ఉంటుందో తాత ద్వారా తెల్సుకున్నాడు. అదే తన వివేకాన్ని హెచ్చరించింది. తన తప్పును గుర్తించేలా చేసింది. ఓ ముసలి తండ్రి మనసుపడే క్షోభను ప్రపంచంలోనిసంపదలు కూడా తీర్చలేవని తేలిపోయింది. బీదవాడే గానీ బిచ్చగాడు కాని ఆ తాత అభిమానం నిజంగా ఆదర్శదాయకం. బస్సు దిగిపోతూ, ఆ తర్వాత చలిబాధని తను ఎలా తట్టుకుంటాడో అని బాధపడిపోయాడు. ఇది ఎల్లలులేని మంచితనాన్ని చూపిస్తోంది. పక్కవాడి బాగు గురించి ఆలోచించకుండా "చిన్ని నా బొజ్జకు శ్రీరామ రక్ష" అని ప్రజలు అనుకునే ఈ రోజుల్లో కూడా "స్వంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి సాయపడవోయ్" అన్న ఆదర్శాన్ని అక్షరాలా పాటిస్తున్న మహోన్నతమూర్తి.

పూర్తిగా తెల్లవారిపోయి, ఎండకూడా వచ్చింది. కిటికీలోంచి వస్తున్న గాలిలో చల్లదనంతగ్గి హాయిగా అన్పిస్తోంది. అద్దాన్ని పూర్తిగా పక్కకు జరిపేసి గాలిని ఆహ్వానించేడు సుందరమూర్తి ఆ గాలి చలిగాలి అయినాకూడా చలించనంత మనోధైర్యం కల్గింది అతనిలో.

బస్సు హైద్రాబాదు చేరింది. హుషారుగా ఎటాచీ తీసుకుని బస్సు దిగేడు సుందరమూర్తి.

ఆటోలో కూర్చున్నాకా మరోసారి నిర్ణయం చేసుకున్నాడు. ఓ వారంరోజులు శలవుపెట్టి వెళ్ళి తండ్రిని చూసి, బలవంతంగానైనా ఆయన్ని తనతో తీసుకు వచ్చేయాలనీ, తమ్ముడికి వెంటనే డబ్బు పంపించాలనీ ఆ నిర్ణయం. ఆనందంగా "ఫర్ ఎ ఫ్యూ డాలర్స్ మోర్" మ్యూజిక్‌ని సుందరమూర్తి ఈల వేస్తుండగా ఆటో దూసుకుపోయింది- హోటల్ అన్నపూర్ణ వైపు.